


శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

నూతన సంవత్సర వేడుకల్లో యువత ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన, శాంతి భద్రతలకు విఘాతం కల్పించినా ఉపేక్షించబోమని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి. రత్న హెచ్చరించారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ఆరోగ్య కరమైన వాతావరణం లో జరుపుకోవాలని జిల్లా సూచించారు. జిల్లాలో 30 పోలీస్ ఆక్ట్ అమలు లో ఉన్నందున ప్రజలందరూ పోలీస్ నిబంధనలు పాటించాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి 10 గంటల తరువాత పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతున్నందున ఆత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు.అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో ముఖ్యమైన జంక్షన్‌లు అదే విధంగా ముఖ్యమైన ప్రదేశాలలో పికెట్లు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నూతన సంవత్సర వేడుకల ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.

కనుమరుగవుతున్న అటవీ సంపద



- అధికారుల చేతిలో వాల్టా చట్టం ఉల్టా
- వృక్ష సంపద కంటే డబ్బు సంపాదనే ముఖ్యం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఆందోళనలో పర్యావరణవేత్తలు

నన్ను కొడుతున్నారని చెట్టు చెప్పలేదు.. బహిరంగంగానే రవాణా అవుతున్నా అధికారులు పట్టించుకోరు. వెరసి కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. జిల్లాలో కొంతమంది కలప వ్యాపారులు ధనార్జన కోసం నిబంధనలు మీరుతున్నారు. వాల్టా చట్టంపై గొడ్డలి వేటు వేస్తూ రోడ్ల వెంట ఉన్నా చెట్లను రోడ్డు అభివృద్ధి పేరుతో నరికేస్తున్నారు. వాటిని ఇటుక బట్టీలు, హోటళ్లు, టింబర్ డిపోలకు తరలిస్తున్నారు. రోడ్ల వెంట ఉండే పొలాల్లోని తమ పైరుపై చెట్టు నీడ పడుతోందని, పంట సరిగా పండడం లేదని రైతులు ఫిర్యాదు చేస్తే కేవలం కొమ్మల వరకు తొలగించుకోవాలని అధికారులు అనుమతిస్తారు. అలాంటిది వేప, నల్లతుమ్మ సహా అనేక రకాల భారీ చెట్లను అక్రమార్కులు కొట్టేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా చెట్లు పెంచేవారు లేకున్నా ఇంత పెద్ద మొత్తంలో కలప ఎలా రవాణా అవుతుందనే అంశంలో అధికారుల ఉదాశీనతే అక్రమార్కులకు ఆదాయ వనరులుగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

అక్రమ కలప రవాణాను అడ్డుకుని వృక్ష సంపదను కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో మునుగుతున్నారు. కలప వ్యాపారుల నుంచి అటవీ శాఖ అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడటంతో విలువైన కలపను కొల్లగొడుతున్నారు. ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా చెట్లు కొట్టి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. టేకు, వేప, పాచి, ఇరిడి వంటి విలువైన కలప ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు అక్రమ మార్గంలో తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా చెట్లు కొట్టి, పచ్చదనాన్ని, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఏపుగా పెరిగిన చెట్లతో పాటు రైతులు పెంచుకున్న చెట్లు సైతం అక్రమార్కులు నరికి సొమ్ము చేసుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడం లేదు. దీంతో వృక్షసంపద రోజురోజుకు తరిగిపోతుంది. ప్రభుత్వ, అటవీ బీడు భూముల్లో మొక్కలు నాటినా, ఇందుకోసం ప్రభుత్వ ధనం కోట్ల రూపాయలు ఏటా వెచ్చించినా ప్రయోజనం శూన్యమే అవుతోంది. ప్రకృతిని, వృక్ష సంపదను కాపాడటానికి ప్రభుత్వం తీసుకొచ్చిన వాల్టాచట్టం అటవి, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన హిందూపురం నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉల్టా అవుతోంది. అక్రమంగా కలపను రవాణా చేయడాన్ని అదుపు చేయాలని ప్రభుత్వం చెబుతుంటే అటవీశాఖ అధికారులు మాత్రం స్మగ్లర్ల ఆటను మరింత ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం చెట్లను యథేచ్ఛగా నరికి రవాణా చేయడాన్ని కట్టడి చేయడానికి చెక్‌పోస్టులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ ప్రభుత్వ ఉద్దేశ్యం నీరుగారి పోతుంది. చెక్‌పోస్టుల దాటి అక్రమంగా కలప రవాణా జరుగుతూనే ఉంది. అయినా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలతో పాటు లేపాక్షిలో ఉన్నా పరిశ్రమల నిర్వహకులు యధేచ్ఛగా పరిశ్రమల్లో ఉన్న బాయిలర్లకుకలపను ఉపయోగిస్తున్నారు. ఈ విషయం తెలిసినప్పటికి అటవీ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపిస్తున్నాయి. అన్ని ఆధారాలతో అటవీశాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికి చర్యలు తీసుకోవడం పక్కన పెడితే, ఏ ఒక్కరికి కనీసం నోటీసులు సైతం ఇవ్వడం లేదని సమాచారం. మరి కొంత మంది అటవీ శాఖ అధికారులు ప్రభుత్వ భూముల్లో ఉన్నా ప్రకృతి సంపదను అడ్డంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో నరకిన చెట్లను ఇక్కడి నుంచి పావగడకు ఎగుమతి చేసుకుని అక్కడి నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబందించి అన్ని ఆధారాలతో పర్యావరణ వేత్తలు ఫిర్యాదు చేసినప్పటికి ఒక్క ట్రాక్టరు పట్టుకోలేదు. ఒక్క కేసు నమోదు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చెట్లను సంరక్షించాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

చెట్లకు రక్షణ ఏదీ..

భారీగా చెట్లను నరికి వేయడం వలన చెట్ల పరిరక్షణ కరువైంది. దీని వలన పచ్చదనం, ప్రాణవాయువు తగ్గిపోతోంది. కాలుష్యం పెరిగి వాతావరణం సమతుల్యం దెబ్బతింటోంది. లేపాక్షి, చిలమత్తూరు, మడకశిర, సోమందేపల్లి తదితర ప్రాంతాలలో అటవీ ప్రాంతం ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉంది. చెట్లను విపరీతంగా నరికి తరలించడం వలన అడవుల విస్తీర్ణం తగ్గిపోతోంది. ఇక్కడ ఉంటున్న అడవి జంతువులు జనావాసంలోకి చొరబడుతున్నాయి. కాస్తాకూస్తో అడవి విస్తీర్ణం ఉండగానే జంతువుల ఇలా వస్తుంటే ఇక అడవులను పూర్తిగా నిర్వీర్యం అయితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో మరి.

అటవీ శాఖలో అక్రమాలు

చట్టాల్లో ఉన్న లొసుగులను ఉపయోగించుకుని అటవీశాఖ అధికారులు కొంత మంది అక్రమార్కులకు అండగా నిలుస్తూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అక్రమ కలప రవాణాను అదాయ వనరుగా మల్చుకుని దొరికినంత దోచుకుంటున్నారు. ఇక చెక్‌పోస్టులన్నా అవి నామమాత్రంగానే ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రధానంగా చింత, వేప కానుక, మద్ది, వివిధ రకాల నీడనిచ్చే భారీ చెట్లను, ఫలాలు అందించే చింత కానుగ, వేప చెట్లను తెగనరికి తరలించేస్తున్నారు. కాలుష్యాన్ని తగ్గించే చెట్లను నరికించి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్న వారికి మొక్కుబడిగానే జరిమానాల పేరుతో ఫారెస్టు అధికారులు వారిని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



రవాణాకు సిద్ధంగా ఉంచిన చెట్ల మొద్దులు

కార్మిక సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిద్దాం

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు



నూతన కార్యవర్గ సభ్యులతో సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

నూతనంగా ఎంపికైన కార్యవర్గం కార్మికులను సంఘటితం చేసుకుని ఐక్యంగా కార్మిక సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దామని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇందిరా పార్కులో సిఐటియు అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ సిఐటియు కన్వినింగ్ కమిటీని ఎంపిక చేశారు. కన్వీనర్ గా విఆర్ రాము, కో కన్వీనర్‌గా ఆటో రామకృష్ణ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు మాట్లాడుతూ నాయకత్వం అంటే అందరి బాధ్యతను మోసేవారన్నారు. అందులోనూ కార్మిక సంఘం నాయకులపై మరింత బాధ్యత ఉంటుందన్నారు. ప్రతినిత్యం కార్మికుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేయాలన్నారు. హిందూపురం పట్టణంతో పాటు రూరల్ మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలలో ఎన్నో పరిశ్రమలు ఉన్నాయన్నారు. ఈ పరిశ్రమల్లో యాజమాన్యాలు చాలీచాలని వేతనాలు ఇచ్చి, కార్మికులతో వ్యక్తి చాకిరి చేయించుకుంటున్నారన్నారు. దీంతో పాటు పట్టణంలో బీడీ కార్మికులు, అగరబత్తి కార్మికులు తదితర వర్గాలకు చెందిన కార్మికులు తక్కువ ఆదాయాలతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అన్ని వర్గాల కార్మికులను ఐక్యం చేసి, వారికి కార్మిక చట్టాల గురించి వివరించి, వారి హక్కుల కోసం పోరాటాలను చేపట్టాలని నూతన కార్యవర్గానికి సూచించారు. నూతనంగా ఎంపికైన నాయకులు మాట్లాడుతూ, కార్మికులు ఐక్యం చేసుకుని వారి హక్కుల కోసం పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, ఉపాధ్యక్షులు గురునాథ్, సివిల్ సప్లై యూనియన్ సెక్రటరీ శ్రీరాములు, మూర్తి, మెడికల్ రెప్స్ యూనియన్ సుబ్రమణ్యం, రామ్మూర్తి, రికార్డ్ మిల్ యూనియన్ సదాశివరెడ్డి, బైలప్ప, లక్ష్మయ్య, కూరగాయల మార్కెట్ యూనియన్ నారాయణ స్వామి, ప్రశాంత్, ఆర్ ఎల్ ఎఫ్ సి యూనియన్ నాయకులు లక్ష్మీకాంత్, అంజయ్య, ఆటో యూనియన్ అమర్, అంజలి, యాది మీటర్స్ యూనియన్ బైలప్ప, అశ్వర్థ రెడ్డితో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి సవిత



రోడ్డు పనుల నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి - పరిగి

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్రంలో ఒకవైపు సంక్షేమ మరోవైపు అభివృద్ధి సమభాగాలుగా నిర్వహించుకుంటూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నామని బీసీ సంక్షేమ, చేనేత టెక్స్టైల్ శాఖ మంత్రి సవిత తెలిపారు. ఆదివారం పరిగి మండలంలోని హొన్నంపల్లిలో ఎంపీ పార్థసారథి తో కలిసి మంత్రి సవితమ్మ కనకదాసు విగ్రహ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. గొల్లపల్లి , కొడిగేనహళ్లి పుట్టగొర్లపల్లి గ్రామాలలో కనకదాసు జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పైడేటి గ్రామ సమీపంలో రూ.3.5కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను ఆమె పరిశీలించారు. రోడ్ల మరమ్మతుల పనులను పరిశీలించి కూలీలతో కలిసి రోడ్డు పనుల్లో పాల్గొన్నారు.అనంతరం పరిగి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.పార్టీ ఏర్పడిన సమయం నుండి మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహం లేని లోటును మంత్రి సవితమ్మ తీర్చునున్నట్లు స్థానిక నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు డ్రైనేజీల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యతిస్తున్నామని వీటిని పూర్తి చేసిన వెంటనే ఇతర వాటిపై దృష్టి పెడతామని అన్నారు. అక్కడక్కడ తాగునీటి సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు.తమ ప్రభుత్వ హయాంలో పేదలు ఎక్కడ ఇబ్బంది పడకూడదని మునుముందు నూతన ఇళ్ళ నిర్మాణాలతో పాటు కొత్త రేషన్ కార్డులు నూతన పెన్షన్ల పంపిణీకి శ్రీకారం చూడుతున్నామని మంత్రి చెప్పారు. మోదా పంచాయతీ గోరవనహళ్లిలో కల్యాణోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ, సర్పంచి బాలాజీ, మాజీ సర్పంచి నారాయణరెడ్డి, నాగభూషణ, వెంకటేష్, కరణం లక్ష్మణరావు, ఈశ్వరప్ప, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, మహేష్, మైలారప్ప, డీఎస్ఎల్ శ్రీనివాసులు, కంకర శ్రీనివాసులు, పుట్టగొర్లపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాబాలో గంజాయి విక్రయాలు

410 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం

చిలమత్తూరు మండలం కొడికొండ జాతీయ రహదారిలో బూదిలి శెట్టిపల్లి గ్రామ పరిధిలో రాజస్థాని మహాదేవ రాకి దాబాలో గంజాయి విక్రయిస్తున్న వారిని అరెస్టు చేసి 410 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య పేర్కొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు అందిన సమాచారం మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ శ్రీరామ్ పర్యవేక్షణలో దాబాలో తనిఖీలు నిర్వహించామన్నారు. దాబా నిర్వహకులు 11 గ్రాములతో గంజాయిని పాకెట్లు చేసి విక్రయిస్తున్నారన్నారు. మొత్తంలో సంచిలో ఉన్నా గంజాయిని పరిశీలిస్తే 410 గ్రాములు ఉందన్నారు. గంజాయితో పాటు 8.9 కేజీల ఓపియం పాపి హస్క్ (గసగసాలు)ను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాబా నిర్వహిస్తున్న మంగల్ రామ్, ఇంద్రజిత్, ధన రామ్ లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎన్‌ఫోర్సుమెంట్ సిఐ అలీ బేగ్, వీఆర్వోలు రామాంజనప్ప, అశ్వర్థ నారాయణ, ఎక్సైజ్ ఎస్ఐ లు పద్మ, ఫరూక్, హెడ్ కానిస్టేబుల్ లు వెంకటసుబ్బయ్య, రామచంద్ర తో పాటు సిబ్బంది వెంకట నారాయణ, చరణ్, సుధాకర్ రెడ్డి, రంగధామా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



లేపాక్షిలో నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో నిర్వహించిన దినోత్సవంలో ముఖ్యఅతిథి, పూర్వ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్‌హెచ్.బాషా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1970లో కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం నినాదంతో అధ్య యనం పోరాటం అంటూ యావత్తు విద్యార్థుల సమస్యల పై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో అనేక ఉద్యమాలు చేపడుతూ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏర్పడిందన్నారు. కేజీ నుండి పీజీ వరకూ విద్యార్థుల సమస్యలు ఎక్కడుంటే అక్కడ ఎస్ ఎఫ్ఐ ముందుంటూ నిరంతరం విద్యార్థులను చైతన్యపరుస్తూ శాస్త్రీయ దృక్పథంతో ముందుకు తీసుకెళ్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, ఉపాధ్యక్షులు కనుమ దామోదర్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షి : విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ రాజీ లేని పోరాటాలు చేస్తుందని జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర బిసి వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలు, విద్యారంగం ప్రవేటీకరణకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు మంజు నాథ్, నరసింహమూర్తి, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పరిగి : మండలంలోని కొడిగెనహళ్లి బిసి వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు భగత్, అభిలాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

4న ఎమ్మెల్యే 'కందికుంట'కు చేనేతల సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చేనేత కుల బాంధవుడు, బిసి నాయకులు, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను జనవరి 4వ తేదీ పట్టణంలోని శివానగర్ శివాలయం ఆవరణలో సన్మానిస్తున్నట్లు పట్టణ చేనేత కులాల ఐక్యవేదిక నిర్వాహకురాలు సంకారపు జయశ్రీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో ఐక్యవేదిక సభ్యులతో కలిసి సన్మాన సభ కరపత్రాలు విడుదల చేశారు. జయశ్రీ మాట్లాడుతూ ఈ సభలో చేనేతల సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. కందికుంటతో పాటు రాజకీయాలకు అతీతంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ బండారు ఆనందప్రసాద్‌ను సన్మానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని చేనేత కుల బాంధవులు, తొగటవీర క్షత్రియ, పద్మశాలి, పట్టుశాలి, దేవాంగం, స్వకుల సాలె, కుర్ని, కత్రి చేనేత కుల బాంధవులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిర్రాజు రవి, గుద్దిటి రాము, బీరే గోపాల్, కొండా పుల్లయ్య, టీచర్ ప్రకాష్, పరిసే సుధాకర్, చింతా నాగరాజు, దాసరి రంగయ్య, హేమంత్, పామిశెట్టి శివశంకర్, బీరే కేశవ, నీలూరి శ్రీనివాసులు, గడ్డం శ్రీనివాసులు, గడ్డం పార్థ, కోనేటి వెంకటేష్, పొట్టి ప్రసాద్, ఉక్కిసెల గోవిందు, ఉక్కిసెల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సూక్ష్మ నీటి సాగుతో అధిక దిగుబడులు

ఎపిఎంఐపి పీడీ బి. సుదర్శన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏపీ సూక్ష్మ నీటి సాగు పథకం (ఎపిఎంఐపి) ప్రాజెక్టు డైరెక్టర్ బి. సుదర్శన్ పేర్కొన్నారు. గత 50 ఏళ్ల క్రితంతో పోల్చితే ప్రస్తుతం వ్యవసాయంలో గణనీయ మార్పులు వచ్చాయి. గతంలో ఏటా సమృద్ధిగా వర్షాలు కురిసి బావులలో, కుంటలలో, చెరువులలో, తాగు, సాగు నీరు పుష్కలంగా ఉండేవి. రానురానూ బావుల క్రింద చెరువులలో నీటిసాగు పూర్తిగా మారిపోయింది. అతివృష్టి లేదా అనావృష్టితో రైతాంగం సతమతమవుతుండగా వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయింది. రైతులు 300 నుంచి 500 అడుగుల వరకు బోర్లు వేస్తున్నప్పటికీ నీరు దొరకడం గగనమైంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు తిరిగి రాకపోవడం, ఖర్చు పెరిగిపోవడం అప్పుల్లో కూరుకుపోవడంతో వ్యవసాయం దండగ అనే స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకుపోవడానికి కాలానుగుణంగా స్ప్రింక్లర్లు, డ్రిప్పు పరికరాలతో రైతులు తక్కువ నీటితో ఎక్కువ సాగు విధానం మొదలైంది. సమయం, కూలీల ఆదాతో పాటు ఖర్చులు తగ్గి అధిక దిగుబడి సాధించే దిశగా ప్రభుత్వం డ్రిప్పు, స్ప్రింక్లర్లతో సూక్ష్మ నీటి సాగు విధానం తీసుకువచ్చింది. రైతులకు సబ్సిడీతో పరికరాలు అందించడం జరుగుతోంది. ఈ సందర్భంగా సూక్ష్మ నీటి సాగు పథకం రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నట్లు ఎపిఎంఐపి పీడీ సుదర్శన్ చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా రైతులకు కలిగే లాభాలు ఏమిటి.?

జవాబు : స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాల ద్వారా నీరు వృధా కాకుండా మొక్క మొక్కకు నీరు అందుతుంది. 5 ఎకరాలకు నీరు తడవలాంటే పాత పద్ధతిలో అయితే రెండు లేదా మూడు రోజులు పడుతుంది. డ్రిప్పు పరికరాల వల్ల ఒకరోజులో నీరు అందించవచ్చు. దీంతో రైతులకు సమయం ఆదా అవుతుంది. కూలీల సంఖ్య తగ్గుతుంది. విద్యుత్ ఆదా అవుతుంది. ఎరువుల వాడకం తగ్గుతుంది. నాణ్యమైన దిగుబడి పొందవచ్చు. పాత పద్ధతిలో అయితే ఎకరాకు 15 నుంచి 20 బస్తాలు వస్తే సూక్ష్మ నీటి సాగు వల్ల 30 బస్తాలు పైగానే దిగుబడి పొందవచ్చు.

ప్ర : ఈ పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వివరాలు తెలపండి.?

జ : డ్రిప్పు పరికరాలకు 5 ఎకరాల వరకు 90 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుంది. 5 నుంచి పది ఎకరాల వరకు అయితే 70 శాతం సబ్సిడీ అందుతుంది. అదే స్ప్రింక్లర్లు అయితే 5 ఎకరాలకు 55 శాతం సబ్సిడీ 5 నుంచి 12.5 ఎకరాలకు 45 శాతం సబ్సిడీ అందుతుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, సన్న చిన్నకారు రైతులంటూ కేటగిరీలు ఉండవు. ఏ రైతు అయినా తీసుకోవచ్చు.



ప్ర : ఈ పరికరాల కోసం ఎవరిని సంప్రదించాలి.? ఎకరాకు ఎంత సబ్సిడీ పొందవచ్చు.?

జ : ఈ పరికరాల కోసం ఆయా గ్రామాలలో రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. విస్తీర్ణాన్నిబట్టి సబ్సిడీ ఉంటుంది. ఉదాహరణకు ఎకరా భూమికి బయట మార్కెట్‌లో అయితే రూ.30 వేలు ధర చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ద్వారా అయితే సుమారు రూ. 17 వేలతోనే పొందవచ్చు.

ప్ర : రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఎన్ని రోజులలో పరికరాలు అందుతాయి.?

జ : రిజిస్ట్రేషన్ చేసుకున్న నెల రోజులకే రైతు ఇంటి వద్దకే డెలివరీ అవుతుంది. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలే బాధ్యతగా రైతు ఇంటికి చేర్చుతాయి. ఈ పరికరాలకు కంపెనీ 5 సంవత్సరాలు గ్యారెంటీ ఇస్తుంది. ఏవైనా మరమ్మతు పనులు ఉంటే ఆయా కంపెనీ ప్రతినిధులే చేస్తారు.

ప్ర : ఇప్పటివరకు ఎన్ని హెక్టార్లకు పరికరాలు పంపిణీ చేశారు.? రిజిస్ట్రేషన్ కు ఇంకా గడువు ఉందా.?లి

జ : 2025 మార్చి ఆఖరుకు 30 వేల హెక్టార్లకు ఈ పరికరాలు అందించాలన్నదే లక్ష్యం. ఇప్పటివరకు 5 వేల హెక్టార్లకు పరికరాలు మంజూరు కాగా 2700 హెక్టార్లకు పరికరాలు అందించడం జరిగింది. రైతులు ఇప్పటి నుంచి వచ్చే మార్చి నెల వరకు రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువు ఉంది. గుర్తింపు పొందిన 28 కంపెనీలు ఈ పరికరాలను సరఫరా చేస్తాయి.



పీడీ సుదర్శన్

ప్ర : సూక్ష్మ నీటి సాగుపై రైతులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.? సిబ్బంది కొరత ఉందా.?

జ : సిబ్బంది కొరత అంటూ లేదు. ఉన్న సిబ్బందితోనే రైతులకు సేవలు అందిస్తున్నాము. రైతులకు సూక్ష్మనీటి సాగు విధానంపై గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నాం. పాత పద్ధతిలో కాకుండా నూతన సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా అధిక లాభాలు పొందవచ్చు. రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న పరికరాల ద్వారా వ్యవసాయంలో నష్టం కలగకుండా అధిక దిగుబడులు సాధించాలని కోరుతున్నాం. ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే ఆయా గ్రామ రైతు కేంద్రాల ద్వారా పరిష్కరించుకోవచ్చు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

నేరాల నియంత్రణకు కృషి : డీఎస్పీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఇటీవల కాలంలో డివిజన్ పరిధిలో చాలా వరకూ నేరాల తగ్గుదల, నియంత్రణకు కృషి చేసి నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ రాత్రి పట్టణంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తుకోకుండా సుహృద్భావ వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కోరారు. యువత రహదారులపై కేక్ కట్ చేయడం, మద్యం తాగి బైకులు నడపడం, సైలెన్సర్లు తీసేసి నడపడం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో చోరీల నియంత్రణ, డ్రగ్స్ నివారణ, డ్రంక్ అండ్ డ్రైవ్‌కి అడ్డుకట్ట వేశామన్నారు. పిల్లల కదలికల పై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. పట్టణం విస్తరించిన నేపథ్యంలో రెండో పట్టణ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపామని, సాధ్యమైనంత తొందరలో ఏర్పాటయ్యే అవకాశాలున్నట్లు తెలిపారు. పట్టణంలో పటిష్ట నిఘా కోసం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారంతో రూ.45 లక్షలు వెచ్చించి వంద అధునాతన సీసీ కెమెరాలను తొందరలో ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో సిఐ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టియు నాయకులు

జెవివి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని సూర్య పాఠశాలలో ఆదివారం జన విజ్ఞాన వేదిక(జెవివి) నూతన సంవత్సర (2025) క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాబోయే కొత్త సంవత్సరాన్ని అందరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని జెవివి రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ సాకే భాస్కర్ పిలుపునిచ్చారు. యువత గంజాయి, మాదక ద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులు, తదితర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ ప్రభుత్వం మాదకద్రవ్యాలను వాడకూడదని చెబుతుం దని, అయితే మద్యం కూడా అదే కోవలోకి వస్తుందని మద్యాన్ని కూడా నిషేధించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మహేంద్రరెడ్డి మాట్లాడుతూ చెడు అలవాట్లు జీవితాలను నిర్వీర్యం చేస్తాయని వాటి జోలికి వెళ్లకుండా బాధ్యతగా జీవించాలన్నారు. జిల్లా కార్యదర్శి హరి మాట్లాడుతూ హత్యలు, అత్యాచారలు, గొడవలు, ప్రమాదాలకు చాలా వరకూ మద్యం మత్తే కారణమని, కావున ప్రభుత్వం మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆదాయం కోసం పేదల బతుకులతో ఆడుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ విక్రాంత్, డాక్టర్ సుధాకర్ రావ్, జెవివి నాయకులు బాలగంగాధర్ నాయక్, రామకష్ణ, లక్ష్మీనారాయణ, బాబు, లక్ష్మీనారాయణరెడ్డి, లోకేష్, నరేంద్రబాబు, సురేష్, మనోహర్ పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ రాజీ లేని పోరాటాలు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 2025 నూతన సంవత్సర డైరీ, వాల్ క్యాలెండర్, స్టిక్కర్ క్యాలెండర్లను రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆవిష్కరించారు. పట్టణంలోని మంత్రి నివాసం వద్ద యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచం ద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, గౌరవాధ్యక్షులు కె.భూతన్న, సహాధ్యక్షులు జిహెచ్.బాబు, కోశాధికారి డి.శ్రీనివాసులుతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలపై కాకుండా, ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ 30 శాతం ప్రకటించి, 12వ పీఆర్సీ అమలు చేయాలని, ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని, సిపిఎస్, 117 జీవో రద్దు చేయాలని, పదో తరగతి వంద రోజుల ప్రణాళికలో ఆదివారాలు, పండుగ రోజులను మినహాయించాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో తెలుగు నాడు విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, యుటిఎఫ్ నాయకులు ఈ.నారాయణస్వామి, సునీల్, ఆజాంబాషా, రామకృష్ణానాయక్, జి.రమేష్, రవీంద్రనాథ్, నరసింహులుబాబు, రామాంజనేయులు, గోవిందప్ప, రమేష్, లక్ష్మయ్య, అనిల్, చంద్ర, పి.శ్రీనివా సులు, జి.లక్ష్మీపతి, వి.శ్రీనివాసులు, సి.సుబ్రహ్మణ్యం, హెచ్.రామాంజనేయులు, అమరనారాయణరెడ్డి, సత్యమయ్య, జె.నరేష్, తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి, నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చాలని ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని బీడుపల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు శ్రీ జి.హరిప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రఘునాథరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 6 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో మీనమేషాలు లెక్కించడం తగద న్నారు. అనంతరం జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన తరుగు చెన్నకృష్ణారెడ్డి, రవినాయక్, నఫీసా, నాగభూషణం, రామ్మూర్తి, కె.చంద్రశేఖర్, సుధాకర్, మహమ్మద్ ఇషాక్, ఎం.చంద్రశేఖర్, బీలునాయక్, సరస్వతమ్మ, ఎం.సత్యనారాయణ, సుబ్రహ్మణ్యంలను ఘనంగా సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియాల మురళి, రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, ఆర్థిక కార్యదర్శి గోపాల్ నాయక్, సిపిఐ జిల్లా కార్యదర్శి శ్రీ వేమయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బిఎస్.ప్రసాద్, వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీప్రసాద్, ఆదినారాయణ, సుధాకర్, జిల్లా కార్యదర్శులు సంపత్‌కుమార్, వెంగమ నాయుడు, రవిచంద్ర, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్‌టియు నాయకులు

నేరాలు ఘోరాలు

చోరీల కేసుల్లో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-గోరంట్ల

ఓ చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిం చారు. కొంతకాలంగా మండలంలో జరిగిన వరుస చోరీల నేపథ్యంలో సిఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బృందంగా ఏర్పడి దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పాలసముద్రం వద్ద లేపాక్షికి చెందిన సింహాద్రి, శ్రీహరి, కర్నాటకలోని నగిరి గ్రామానికి చెందిన శివరాజ్ కుమార్ ఆదివారం అరెస్ట్ చేసి వారి నుంచి 12 తులాల బంగారు ఆభరణాలు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నార న్నారు. వీరు గోరంట్ల పట్టణంతో పాటు మండలంలోని ఎముకలగుట్టపల్లి, బూడిదదిన్నె ప్రాంతాల్లో వృద్ధులకు మాయమాటలు చెప్పి వారి నుంచి బంగారు నగలను లాక్కెళ్లారన్నారు. చోరీ కేసులను ఛేదించిన సిఐ శేఖర్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్ఐ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని వలిసాబ్ రోడ్డు గఫూర్‌సాబ్ వీధిలో నివాసం ఉంటున్న షేక్‌సాధిక్ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సాధిక్‌బాషాకు 14 ఏళ్ల క్రితం కదిరి పట్టణానికి చెందిన తన మేనమామ అయూబ్ కుమార్తె షేక్‌రుబీనాతో వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. షేక్‌రుబీనా ఈ నెల 23వ తేదీ సాయంత్రం బాత్‌రూమ్‌కి వెళ్తున్నానని పిల్లలకి చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదని, చుట్టు పక్కల, బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. భర్త సాధిక్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని మోదా పంచాయతీ చెర్లోపల్లి వద్ద కర్నాటక సరిహద్దు సమీపంలో ఆదివారం గుర్తు తెలియని శవాన్ని స్థానికులు గుర్తించారు. వారు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రంగడుయాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని పరిశీలించారు. అతడు మూడు, నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని తెలిపారు. స్థానిక రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేయించి కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్నాటకమద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మండలంలోని పెదపల్లి తండాలో కర్నాటక మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ నాగరాజు తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పెదపల్లి తండాలో కర్నాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి ఓ మహిళను అదుపులోకి తీసుకొని ఆమె నుంచి 40 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. విక్రేతపై కేసు నమోదు చేసి తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు. సిఐ వెంట ఎస్ఐ ఉమామనోహర్‌రాజు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి-గుంతకల్లు ప్యాసింజర్ రైలు రద్దు తగదు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ఉమ్మడి అనంతపురం జిల్లాల మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్న గుంతకల్లు-తిరుపతి ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకూ రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించడంతో సిపిఐ ముదిగుబ్బ మండల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లు -తిరుపతి ప్యాసింజర్ రైలుతో పాటు పలు రైళ్లను ఉత్తరప్రదేశ్‌లో జరిగే కుంభమేళా ఉత్సవాలకు మళ్లించడం శోచనీయమన్నారు. ఆయా రైళ్ల రాకపోకలను తక్షణమే పున్ణ ప్రారంభించాలని, లేనిచో సిపిఐ ఆధ్వర్యంలో త్వరలోనే గుంతకల్లు డిఆర్ఎం ఆఫీస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తిప్పయ్య, ఆ పార్టీ రైతు సంఘం నాయకులు గంగిరెడ్డిపల్లి నాయుడు, నాయకులు తుమ్మల చెన్నప్ప, చంద్రచర్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

31 రాత్రి పోలీసు ఆంక్షలు పాటించాలి

ప్రజాశక్తి-హిందూపురం

డిసెంబర్ 31 రాత్రి పట్టణంతో పాటు డివిజన్ వ్యాప్తంగా ప్రజలు పోలీసుల ఆంక్షలు పాటించాలని డిఎస్‌పి మహేష్ కోరారు. ఆదివారం పట్టణ సిఐలతో కలిసి డిఎస్‌పి తన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా డిఎస్‌పితో పాటు పట్టణ సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం ప్రజలకు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 31వ తేదీ రాత్రి హిందూపురం పట్టణంతో పాటు లేపాక్షి, చిలమత్తూరు మండల కేంద్రాలలో విధించిన ఆంక్షలను వివరించారు. మద్యం దుకాణాలను, రెస్టారెంట్లు బార్లను నిర్ణీత సమయంలో మూసి వేయాలని ఆదేశించారు. హిందూపురం పట్టణంలో భారీ ఎత్తున పోలీసు బందోబస్తు చేపట్టనున్నట్లు తెలిపారు. నిబంధనలకు లోబడి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

విశ్రాంత ఉద్యోగులకు పిఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాలి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

విశ్రాంత ఉద్యోగులకు పిఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఓడిసిలో ఆదివారం డిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు కట్టుబడి గౌస్ లాజమ్ మాట్లాడుతూ గత ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు నేటికీ గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ మొత్తం చెల్లించకపోవడం శోచనీయమన్నారు. దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎస్ఐఐ రుణాలు వారి ఖాతాలో జమ చేయాలని కోరారు. 1 నుంచి పదో తరగతి వరకూ సమాంతర మాధ్యమాన్ని కొనసాగించాలని, 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, ఉపాధ్యాయుల సాంకేతిక సమస్యలు పరిష్కరించే గడువును పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహులు, సోమశేఖర్‌నాయక్, వెంకటచలమయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

వాహనదారులు రోడ్డు నియమాలు పాటించకపోతే చర్యలు తప్పవనిధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ హెచ్చరించారు. స్థానిక కూడలిలో ఆదివారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. సిఐ మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రికార్డులు కలిగి ఉండి రోడ్డు నియమాలు పాటించాలన్నారు. తనిఖీలు నిర్వహించినప్పుడు ఏవి లేకపోయినా జరిమానా తప్పదని హెచ్చరించారు. రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని, రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు వాహన డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఆదేశాలు ఇస్తున్నామన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ ప్రభాకర్

ఎంపిడిఒపై దాడి హేయం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబుపై వైసిపి నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రంగనాయకులు తెలిపారు. ముదిగుబ్బలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంచర్ల రవి, ఆది, మహేంద్ర, నారాయణస్వామి, పాల్గొన్నారు.

ఉమర్ ఫారూఖ్ ఖాన్‌కు తెలుగు సేవా పురస్కారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన ఉమర్ ఫారూఖ్ ఖాన్ కు తెలుగు సేవా పురస్కారం లభించింది. 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు విజయవాడలో జరుగుతున్నాయి. ఈ తెలుగు మహాసభల్లో శ్రీ సత్య సాయి జిల్లా రచయితల సంఘం తరపున ఉపాధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ పాల్గొని తాను రాసిన పరిమళాలు వెదజల్లే సువాసనల పూ దోటా నా దేశం అని కవితను వినిపించారు. దీంతోపాటు తెలుగు భాష అభివృద్ధికి చేసిన కృషిని అభినందిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, తెలుగు మహాసభల నిర్వాహకులు మండలి బుద్ధ ప్రసాద్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ చేతులమీదుగా ఉమర్ ఫరూఖ్ ఖాన్ కు తెలుగు సేవా పురస్కారాన్ని అందించి, సత్కరించారు.



మంత్రి సత్యకుమార్ నుంచి పురస్కారం అందుకుంటున్న ఉమర్

రోడ్డు పక్కనే భారీ వాహనాల పార్కింగ్

శిర-కొడికొండ రహదారిలో తరచూ ప్రమాదాలు

గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు

నివారణ చర్యలపై దృష్టి పెట్టని పోలీసులు

ప్రజాశక్తి-అగళి

మండలంలోని శిర వయా అగళి, రొళ్ల, మడకశిర మీదుగా కొడికొండ చెక్‌పోస్ట్ వరకూ జాతీయ రహదారి ప్రారంభమై రెండేళ్లు పూర్తయింది. ఈ రహదారి శిర నుంచి బ్యాడిగెర, రామనపల్లి, హొట్టేబెట్ట, తదితర గ్రామాల మీదుగా కొడికొండ చెక్‌పోస్ట్ వరకూ ఉంది. ఈ మార్గంలో ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రధానంగా వివిధ గ్రామా ల వద్ద రోడ్డు దాటే క్రమంలో, మలుపుల వద్ద పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. కేవలం అగళి మండలంలోనే వాహనాలు ప్రమాదాలకు గురై 25 మంది దాకా ప్రాణాలు కోల్పోయారు. అగళి నుంచి బ్యాడిగెర మధ్య 7 కి.మీ దూరం ఉండగా ఆరు ప్రమాదాలు జరిగాయి. ముఖ్యంగా రైతులు ఇంటి నుంచి పొలానికి, పొలం నుంచి ఇంటికి రాకపోకలు సాగించే క్రమంలో రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. దీంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు దాటుతున్నారు. ఈ రహదారిలో పలుచోట్ల రోడ్డుకు ఆనుకుని ఇరువైపులా హోటళ్లు ఉన్నాయి. దీంతో డ్రైవర్లు హోటళ్ల వద్ద రోడ్డు పక్కనే లారీలను నిలుపుతున్నారు. దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే వారు రాత్రి వేళ కారులో, బైక్‌లో అతివేగంగా వస్తూ రోడ్డు పక్కనే ఆపిన లారీలను గమనించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. వారం రోజుల క్రితం మడకశిర ప్రాంతంలో తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం ఈ కోవలోనే జరిగింది. రోడ్డుకు ఆనుకుని నిలిపిన ఓ లారీని తెల్లవారుజామున ఓ టెంపోట్రావెలర్ వాహనం అతివేగంగా వచ్చి ఢీ కొంది. ఆ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. రోడ్డు పక్కన లారీ నిలిపి ఉంచకపోతే ఆ ప్రమాదం జరిగేది కాదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న పోలీసు అధికారులను రోడ్డు పక్కన భారీ వాహనాలు నిలపడంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేవలం ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేయడం ఆ తర్వాత అటువైపు కన్నెత్తి కూడా చూడరని మండిపడుతున్నారు. ఇకనైనా పోలీసులు అధికారులు స్పందించి భారీ వామనాలు, లారీలను రోడ్డు పక్కనే కాకుండా కాస్త దూరంగా నిలిపేలా హోటళ్ల నిర్వాహకులకు హెచ్చరికలు చేయడంతో పాటు మలుపుల్లో సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే ఆపిన భారీ వాహనాలు

మున్సిపల్ కాంప్లెక్స్ గదుల వేలం వాయిదా

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని హాస్పిటల్ వీధిలో ఉన్న గాంధీ పార్క్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న 11 షాపులకు ఈ నెల 30వ తేదీ బహిరంగ వేలం నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల జనవరి 17వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. వేలంపాట దారులు, ప్రజలు గమనించాలని తెలిపారు.

భోజన ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పాడేరు నుంచి పుట్టపర్తికి వస్తున్న 210 మంది భక్తులకు ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో శ్రీసత్య సాయి సేవా సమితి గాంధీనగర్ కన్వీనర్ నామా ప్రసాద్ ఆధ్వర్యంలో భోజనం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. నామా ప్రసాద్ మాట్లాడుతూ శేషాచారి సహకారంతో వీటిని పంపిణీ చేశామని తెలిపారు. స్టేషన్ మాస్టర్ నరసింహనాయుడు శ్రీసత్యసాయి సేవా సమితి సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకొని తోటి వారికి సాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పదిమంది సమితి సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-తలుపుల

స్థానిక ప్రకాష్‌నగర్‌కు చెందిన గుజిన పల్లి ప్రసాద్(46) ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ మండల కార్యదర్శి జిగిలి ఈశ్వరయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్లు ఎల్‌వి.రమణ, అంజనబాబు, వెంకటనారాయణ, ఎద్దుల రాముడు వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇళ్ల దరఖాస్తు గడువు పొడిగించాలి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందకపోవడంతో ఇప్పటికీ దరఖాస్తు చేసుకోలేకపోయామని, గడువు పెంచాలని, అలాగే కావాల్సిన సర్టిఫికెట్లను సంబంధిత అధికారులు తక్షణమే మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఈఎస్ వెంకటేష్

పేదలకు ఇళ్ల పట్టాలు అందజేయండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక పుట్టపర్తి రహదారిలోని నల్లగొండలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు తక్షణమే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం వారు పేదలు నివాసం ఉంటున్న ప్రాంతానికి వెళ్లి వారి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ 30 కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, వారికి తక్షణమే రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వాలని వారు. ఆయన వెంట సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, మండల కార్యదర్శి ముత్యాలు, ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్, శంకర్‌రెడ్డి, శ్రావణి, తదితరులు ఉన్నారు.

టిడిపి నేత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలంలోని దొడ్డేరి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు, మాజీ ఎంపిటిసి చంద్రప్ప అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆదివారం ఆ గ్రామం వెళ్లి చంద్రప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. చంద్రప్ప మృతి పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే ఇచ్చిన రూ. 10 వేలను టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జికె.ఈరన్న చంద్రప్ప కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, కృష్ణమూర్తి, భరత్‌కుమార్, క్రిష్ణప్ప పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2005-08 బ్యాచ్‌కు చెందిన 60 మంది పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశమయ్యారు. ముందుగా ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమ అభ్యున్నతికి కళాశాల అధ్యాపకులు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అప్పటి అధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప, అధ్యాపకులు ప్రతాప్, దేవిశెట్టి రామన్న, నరసింహులు, జగన్నాథ్, అధ్యాపకేతర సిబ్బంది నాగరాజు, శంకర, నబిరసూల్, రామకృష్ణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఛైర్మన్‌గా జగదీష్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసిన అతి పురాతన శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ అడహక్ కమిటీ ఛైర్మన్‌గా చెన్నంశెట్టి జగదీష్ ప్రసాద్‌ను ఎంపిక చేసినట్లు ఆదివారం ఆలయ ఈవో వెంకటేశులు తెలిపారు. ముందుగా జగదీష్‌ప్రసాద్ దంపతులకు ఆలయ ఈవో ఆధ్వర్యంలో అర్చకులు కొనేరాచార్యులు, మకరంద బాబు, భానుప్రకాష్ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ జనవరి 10వ తేదీ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రామబ్రహ్మం రచనలు సామాజిక దర్పణాలు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

రామబ్రహ్మం రచనలు సామాజిక దర్పణాలు అని వక్తలు పేర్కొ న్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పెనుకొండ రామబ్రహ్మం రచించిన 'రామా వినవేమిరా', 'భక్తి సుధా' గ్రంథాలను ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం, ఆశావాది శశాంక మౌళి ఆవిష్కరించారు. చాంద్‌బాషా మాట్లాడుతూ పెనుకొండ వాసి అయిన రామబ్రహ్మం బెంగళూరులో స్థిరపడ్డారని, ఈయన సైన్సు మాస్టర్‌గా శాస్త్రవేత్తగా, లెక్చరర్‌గా పని చేశారన్నారు. తెలుగు సాహిత్యం మీద మక్కువతో సామాజానికి ఉపయోగపడే అనేక రచనలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగరాజు, సుధాకర్ గుప్తా, కోగిర జయచంద్ర, కవులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

వడ్డెర సంఘం మండల అధ్యక్షుడిగా వెంకటపతి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ముదిగుబ్బలో ఆదివారం జిల్లా వడ్డెర సంఘం నాయకుల ఆధ్వర్యంలో మండల వడ్డెర సంఘం అధ్యక్షునిగా కేతన వెంకటపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షునిగా కేతన ప్రభాకర్, కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శిగా డేరంగుల వేమయ్య, కార్యవర్గ సభ్యులుగా రాజశేఖర్, రామాంజనేయులు, నాగరాజులను ఎన్నుకున్నారు. వెంకటపతి మాట్లాడుతూ మండలంలో వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరాడు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటనారాయణ, ఉత్తన్న, గంగరాజు, సీనియర్ నాయకులు గంగులప్ప పాల్గొన్నారు.



సమావేశమైన నూతన కార్యవర్గం

కరాటేతో ఆత్మరక్షణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

కరాటే సాధనతో విద్యార్థుల్లో ఆత్మరక్షణ, శారీరక ధృఢత్వం పెరుగుతుందని మాస్టర్ అక్బర్ అలీ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం కియో జపాన్ షోటోఖాన్ కరాటే డు అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహించగా 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన వారికి కరాటే సంఘం జిల్లా ప్రెసిడెంట్ మాస్టర్ అక్బర్ ధ్రువీకరణ పత్రాలు, కరాటే బెల్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో కరాటే కోచ్ రియాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

ఎట్టకేలకు పైపులైన్ మరమ్మతులు

ప్రజాశక్తి-రొద్దం

పెనుకొండ-పావడ ప్రధాన రహదారిపై స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో రెండు మూడు చోట్ల తాగునీటి పైపులైన్ పగిలిపోయి కొన్నేళ్లుగా నీరు వృథా అవుతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై ఐదేళ్లుగా పలు దినపత్రికల్లో కథనాలు ప్రచురితమైనా ఫలితం లేకపోయింది. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. వారి చొరవతో ఎట్టకేలకు శని వారం రాత్రి పంచాయతీ సిబ్బంది సీసీ రోడ్డులో పైపులైన్ పగిలిన చోట మరమ్మతులు చేపట్టారు. మిగిలిన చోట్ల కూడా త్వరలోనే మరమ్మతులు చేస్తామని తెలిపారు.



పైపులైన్ మరమ్మతులు చేపట్టిన పంచాయతీ సిబ్బంది